# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-03-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఉజ్జయినిలో ఉన్న మహాకాళేశ్వరుడి ఆలయంలో జరిగిన అగ్ని ప్రమాదం ఘటన అత్యంత బాధాకరమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- తెలుగు రాష్ట్రాలలో ఈ రోజు హోలీ సంబరాలను ఘనంగా జరుపుకుంటున్నారు.
- మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తామని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- విశాఖలోని బీచ్ లను పర్యావరణ హితంగా రూపొందిస్తున్నామని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ వెల్లడించారు.
- సింహాచల క్షేత్రంలో రేపటి నుంచి శ్రీ సుదర్శన నారసింహ మహా యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

==============================

మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో ఉన్న మహాకాళేశ్వరుడి ఆలయంలో ఈరోజు తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదం ఘటన మీద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. ఆయన తన ఎక్స్ అకౌంట్‌లో స్పందిస్తూ, అగ్ని ప్రమాద ఘటన చాలా బాధాకరమని అన్నారు. గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక పరిపాలనా విభాగం, బాధితులకు సాయం చేయడంలో నిమగ్నమైనట్లు తెలిపారు. కాగా, ఆలయం గర్భగుడిలో జరిగిన ప్రమాదంలో 14 మంది గాయపడ్డారు.

==============================

తెలుగు రాష్ట్రాలలో ఈ రోజు హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి. ప్రతి ఒక్కరి జీవితాల్లో రంగులు నిండాలని కోరుకుంటూ ఆనందోత్సాహాలతో రంగులు చల్లుకున్నారు. ఈ వేడుకల్లో భాగంగా పలుచోట్ల మహిళలు, చిన్నారులు ఆటపాటలతో అలరించారు. రాష్ట్రంలో గిరిజనుల ప్రాంతాల్లో హోలీ వేడుకలు హోరెత్తించాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా తాజంగిలో హోలీ

సందర్భంగా రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు చేశారు. ఇదిలా ఉండగా, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపాధ్యక్షులు జగదీప్ ధన్ ఖడ్ దేశప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానమంత్రి  నరేంద్ర మోదీ హోలీ సందర్భంగా దేశ ప్రజలకు సామాజిక మాధ్యమం ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక హోలీ అని  ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి సామాజిక మాధ్యమంలో ట్వీట్ చేశారు.

==============================

విశాఖలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం సింహాచలంలో రేపటి నుంచి శ్రీ సుదర్శన నృసింహ మహా యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఏప్రిల్ 1 తేదీ వరకు ఈ మహాయజ్ఞాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లుగా వివరించారు. భక్తుల కోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఇదిలా ఉండగా శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి డోలోత్సవాన్ని ఈ రోజు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఫాల్గుణ పూర్ణిమ రోజున సాంప్రదాయబద్ధంగా ఈ ఉత్సవాన్ని జరుపుతున్నారు.

==============================

విశాఖలోని బీచ్ లను పర్యావరణ హితంగా తీర్చిదిద్దుతున్నామని మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ కమిషనర్ సీఎం సాయి కాంత్ వర్మ ఈరోజు  పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.  విశాఖ లోని అన్ని బీచ్ లను పరిశుభ్రంగా సుందరమైన బీచ్ లుగా రూపొందించడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. అదే విధంగా అంతరించిపోతున్న అరుదైన “ఆలివ్ రిడ్లే” తాబేళ్ల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లుగా వివరించారు. ఈ తాబేళ్ళ సంతానోత్పత్తికి సంరక్షణ, పరిశుభ్రతా కార్యక్రమాలను చేపడుతున్నట్లుగా వెల్లడించారు. ఇదిలా ఉండగా, బీచ్ లలో సందర్శించే సందర్శకులు వ్యర్థాలను బీచ్ లలో పడవేయకుండా సమీపంలో గల డస్ట్ బిన్ లను ఉపయోగించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

==============================

రాష్టంలో సంపదను సృష్టించి ఆదాయాన్ని పెంచుతామని తెలుగుదేశం పార్టీ అధినేత నారా  చంద్రబాబు నాయుడు తెలిపారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు నాయుడు ఈ రోజు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలతో ఆయన ముఖాముఖి సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ, మహిళలను ఆర్థికంగా శక్తిమంతులుగా తయారు చేస్తామని అన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అన్నీ రంగాలను అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

==============================

విశాఖపట్నం నుండి ఈరోజు రాత్రి ఏడు గంటల పది నిమిషాలకు బయలుదేరాల్సిన విశాఖపట్నం-తిరుపతి ప్రత్యేక ఎక్స్ ప్రెస్ మూడు గంటల ఆలస్యంగా రాత్రి పది గంటల పది నిమిషాలకు బయలుదేరుతున్నట్లు  రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. దీని అనుబంధ రైలు ఆలస్యంగా నడుస్తున్నందున ఈ మార్పు అనివార్యమైందని, ప్రయాణీకులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

విరామం

==============================

ఆగ్నేయ,  నైరుతి గాలుల ప్రభావంతో రాష్ట్రంలో ఉత్తర, దక్షిణ కోస్తా జిల్లాల్లో రానున్న మూడు రోజులలో వాతావరణం పొడిగా ఉండే అవకాశముందని అమరవతిలోని భారత వాతావరణ  శాఖ తెలిపింది. రాయలసీమ జిల్లాలలో రానున్న అయిదు రోజులు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటూ…

(వాయిస్ 24 సెకన్లు)

==============================

జిల్లాలో ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఆయన కోరారు. కాగా, జిల్లాలో వివిధ రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేయు అభ్యర్థులు, బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపుల కోసం అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు.

==============================

జిల్లాలో సి-విజిల్ యాప్ ద్వారా ఇప్పటిదాకా 182 ఫిర్యాదులు అందాయని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్, కె.మాధవీలత ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, జిల్లా యంత్రాంగానికి సహాయ సహకారాలు అందచేయాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ ప్రకటనలు, ప్రచారం కోసం అనుమతులు తప్పనిసరి అని తెలియచేశారు. ప్రచారం కోసం గోడలపై ఎటువంటి రాతలు రాయకూడదు అని, అటువంటి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు.

==============================

వైఎస్సార్ జిల్లాలో వచ్చే నెలలో జరగనున్న ఒంటిమిట్ట శ్రీ సీతా సమేత కోదండరామ బ్రహ్మోత్సవాలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదేశించారు. ఈరోజు స్థానిక టిటిడి పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఏప్రిల్ 16వ తేదీ నుండి 26వ తేదీ వరకు కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లుగా వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని కోరారు.

==============================

ఎన్నికల నిబంధనల పైన అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు పూర్తి అవగాహనతో ఉండాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఈరోజు జిల్లా కలెక్టర్ తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించిన విధివిధానాలను వివరించారు. ఓట్లను పొందడానికి మతం, వర్గం, కులం వంటి సున్నితమైన భావాలను ఉపయోగించుకుని అభ్యర్థించరాదని తెలిపారు.

==============================

ఎన్నికల ప్రచారానికి అవసరమయ్యే అనుమతుల కోసం "సువిధ" యాప్ లేదా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని కాకినాడ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారికి లేదా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

==============================

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈవిఎంల భద్రత కోసం స్ట్రాంగ్ రూమ్ లను ఏర్పాటు చేసేందుకు చిత్తూరు జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లను ఈరోజు పరిశీలించారు. 7 అసెంబ్లీ నియోజకవర్గాలు, చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి ఈవిఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ హాల్ ఏర్పాటుకు కళాశాలకు సంబంధించిన మ్యాప్ లను, కళాశాల విస్తీర్ణాన్ని పరిశీలించారు.

==============================

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్ కుమార్ మీనాకు ఈ రోజు  ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ పదవిలో ఉంటూ రాజకీయ విమర్శలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.  ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘున అని పేర్కొంటూ... ఆయన పైన ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని అచ్చెన్నాయుడు కోరారు. ఈ మేరకు ఎన్నికల ప్రధానాధికారికి అచ్చెన్నాయుడు  లేఖ రాశారు.

===============================

విశాఖపట్నం జంతు ప్రదర్శన శాలలో సుమారు 12 సంవత్సరాల వయస్సు గల "టెకన్" అనే మగ జిరాఫీ నిన్న అర్ధరాత్రి మృతి చెందినట్లు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు. టెకన్ ని 2013లో మలేషియాలోని జంతు ప్రదర్శన శాల నుంచి విశాఖ జూకు తీసుకుని వచ్చారు. ఇదిలా ఉండగా, కోల్ కతాలోని అలీపూర్ జూ నుంచి విశాఖపట్నం జంతు ప్రదర్శనశాలకు త్వరలో రెండు జిరాఫీలను తీసుకువస్తామని క్యూరేటర్ తెలిపారు.

===============================
===============================